# నమస్తే తెలంగాణ

రంజాన్ వేళలు..
ఇఫ్తార్ (మంగళ) : 6:33
సహర్ (బుధ) : 5:06

## జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 12 మార్చి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY




గోపాల్‌పేట : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

# ప్రభుత్వాన్ని నడిపే సమర్థత కాంగ్రెస్‌కు లేదు

- వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ప్రజాతీర్పు
- అభ్యర్థుల విజయానికి కలిసికట్టుగా పనిచేయాలి
- పార్టీ ద్రోహులను ఎప్పటికీ క్షమించం : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, మార్చి 11 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా తీర్పు బీఆర్‌ఎస్ పార్టీకి అనుకూలంగా ఉండబోతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పద్మావతీ గార్డెన్స్‌లో గోపాల్‌పేట, రేవల్లి మండలాల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అధికారం చేపట్టిన నెల వ్యవధిలోనే కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వాన్ని నడిపే సమర్థత లేదని, ఇచ్చిన హామీలను నిలుపుకోలేకపోయిందని విమర్శించారు. సాగునీరు, కరెంటు ఇవ్వకపోవడం వల్లే రైతులు పంటలను మూగజీవులకు మేతగా వేసే దుస్థితి దాపురించిందన్నారు. యాసంగి చివరి పంటకు నీళ్లు ఇచ్చిన ఘనత, అభివృద్ధిలో తెలంగాణను ప్రపంచపటంలో నిలిపిన నాయకుడు కేసీఆరేనని కొనియాడారు. విస్తృత ప్రయోజనాల కోసమే బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నట్లు తెలిపారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని క్షమించే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. ఆ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందనే నమ్మకం లేదని, గతంలో తాము మంజూరు చేసిన అభివృద్ధి పనులను కొనసాగించేలా డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నవీన్‌కుమార్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నాయకులు నాగం తిరుపతిరెడ్డి, కురుమూర్తియాదవ్, తిరుపతియాదవ్, ఎంపీపీ సేనాపతి, వైస్‌ఎంపీపీ చంద్రశేఖర్, మధుసూదన్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ హర్యానాయక్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాములు, కోఆప్షన్ సభ్యులు మతీన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రఘురామారావు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

***హామీలన్నీ అమలు చేయాల్సిందే..***

పెబ్బేరు, మార్చి 11 : నెల రోజుల వ్యవధిలోనే ఇంతటి ప్రజా వ్యతిరేకతను చవి చూసిన ప్రభుత్వాన్ని తన రాజకీయ జీవితంలో తొలిసారిగా చూస్తున్నానని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం పెబ్బేరులోని సహారా ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి మండలస్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు, రుణమాఫీ పథకాల ఊసే ఎత్తకపోవడంతో అన్నదాతల ఆశలు కల్లలయ్యాయని ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్వహణలో విఫలమై రైతులకు సాగునీటిని సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో రైతన్నలకు వెన్నుదన్నుగా నిలిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ నిత్యం ప్రజల మేలు కోరుతుందని, కార్యకర్తలు, నాయకులు తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన సూచించారు. ప్రభుత్వం మారినప్పటి నుంచి నియోజకవర్గంలో అభివృద్ధి అర్ధాంతరంగా ఆగిపోయిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసిన వారంతా ప్రస్తుతం పశ్చాత్తాపపడుతున్నారన్నారు. రానున్న ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, శ్రీరంగాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు జగన్నాథం, పెబ్బేరు మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు వనం రాములు, పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు

# ఎమ్మెల్సీకి 16 నామినేషన్లు

- బీఆర్‌ఎస్‌తర పున దాఖలుచే సినన వీన్‌కుమార్‌రెడ్డి
- కాంగ్రెస్ అభ్యర్థి సహా మరో 14మంది ఇండిపెండెంట్లు

మహబూబ్‌నగర్, మార్చి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సోమవారం నాటికి 16 నామినేషన్లు.. మొత్తంగా 28 సెట్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి, గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి మూడు సెట్ల నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవినాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డి ఆ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి నామినేషన్లు వేశారు. మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా పోటీకి బీజేపీ దూరంగా ఉండడం గమనార్హం. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మినహా మిగతా 14 మంది ఇండిపెండెంట్‌గా నామినేషన్లు వేశారు. కాగా సోమవారంతో మహబూబ్‌నగర్ స్థానికసంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక నామినేషన్ దాఖలుకు గడువు ముగిసింది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ కోటాలో మొత్తం ఓటర్లు 1,439 మంది ఉండగా, ఇందులో ఇద్దరు ఎంపీలు, 14 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు, 888 మంది ఎంపీటీసీలు, 83 మంది జెడ్పీటీసీలు, 449 మంది కౌన్సిలర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఈనెల 28న అన్ని డివిజన్ కేంద్రాల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

***విజయం తమదే..***

ఉప ఎన్నికల్లో విజయం బీఆర్‌ఎస్‌దేనని ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, పార్టీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. ఉప ఎన్నికలో 990 ఓట్లు బీఆర్‌ఎస్ పక్షాన ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కాంగ్రె స్ పార్టీ డబ్బున్న పారిశ్రామికవేత్తలను నిలబెట్టి ఓటర్లను కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా తమదే విజయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయలేక చేతులెత్తేసిందని.. కనీసం పంచాయతీ ఎన్నికలు కూడా జరుపలేని స్థితిలో ఉన్నదని దుయ్యబట్టారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ స్థానాన్ని గెలిచి కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. కాంగ్రెస్‌పై వ్యతిరేకత వచ్చిందన్న సంకేతం ఈ ఉప ఎన్నికతో తేటతెల్లమవుతుందన్నారు.



శేష వాహనంపై ఊరేగుతున్న జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరులు

# అలంపూర్‌లో ముగిసిన బ్రహ్మోత్సవాలు

అలంపూర్, మార్చి 11 : వారం రోజులుగా నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం అవభృత స్నానం(తీర్థావళి)తో ముగిశాయి. శివాలయంలో నిర్వహించిన పూర్ణాహుతితో ఉత్సవాలను పరిసమాప్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వసంతోత్సవం పేరిట ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఉత్సవమూర్తులను శేషవాహనంపై ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల ఎదుట ఉన్న నాగకన్యల బావి వద్దకు తీసుకెళ్లి పంచామృతాలతో అభిషేకించి చక్రతీర్థ, అవభృత స్నానాలు నిర్వహించారు. ఐదు రోజులపాటు మహాకలశంలో ఉంచిన మంత్రజలంతో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అభిషేకించారు. అనంతరం ఉత్సవ బలిభేరితో గర్భాలయ ప్రదక్షిణలు నిర్వహించి ఉత్సవమూర్తులను ఆలయంలోకి చేర్చారు. అదేవిధంగా ఆలయం ఎదురుగా ఉన్న ధ్వజ మండపానికి పూజలు చేసి ధ్వజ అవరోహణ కార్యక్రమాన్ని ఈవో పురేందర్‌కుమార్, ఆలయకమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు చేతుల మీదుగా నిర్వహించారు. వసంతోత్సవం సందర్భంగా మధ్యాహ్నం వెయ్యి మందికి అన్న సంతర్పణ చేశారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

# కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

- మాయమాటలతో అధికారంలోకి వచ్చింది..
- ప్రశ్నించే గొంతుకకు మద్దతిద్దాం
- అధికారం లేకున్నా ప్రజలంతా గులాబీ బాస్ వైపే..
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- నిండు మనస్సుతో ఆశీర్వదించండి: ఎంపీ మన్నె
- ఆదరించండి.. : ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్, మార్చి 11 : కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. దేశంలో ఏ పార్టీకీ లేని చరిత్ర బీఆర్‌ఎస్‌కు ఉందని, ప్రశ్నించే గొంతుకకు మద్దతివ్వాలని కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, శాసనమండలి అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి హాజరై మాట్లాడారు. అనేక పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని అందరి మన్ననలు పొందామన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అందరితో కలిసిమెలిసి ఉంటూ ఎవరినీ నొప్పించే వ్యక్తి కాదన్నారు. ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను తిరుగులేని మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. ఎంపీ గెలిస్తే అందరం గెలిచినట్టేనని, మన సమస్యలను ఢిల్లీలో వినిపించడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడి పరిష్కరించుకోవచ్చన్నారు. గడిచిన పదేండ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను అక్కున చేర్చుకొని ఎలాంటి కష్టం రాకుండా చూసుకున్నదన్నారు. సీఎంఆర్‌ఎఫ్ నిధులతోపాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను అందించామన్నారు. కొందరు కేవలం వ్యక్తి కోసం ఆలోచిస్తూ వ్యవస్థను నాశనం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఉన్నారన్నారు. మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మీ సమస్యలు అన్నీ తెలిసిన మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. 1,400 మంది సభ్యుల్లో 900 మంది బీఆర్‌ఎస్ వాళ్లేనని, వారంతా మన అభ్యర్థికి పూర్తిస్థాయిలో మద్దతు తెలిపి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మన గెలుపు రాష్ట్రంలో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. కాంగ్రెసోళ్లు పార్లమెంట్ ఎన్నికల కోసం అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే తమ లక్ష్యమని, అందుకు సభ్యులు పూర్తిస్థాయిలో బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలపాలని కోరారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై కాలయాపన చేస్తూ కేవలం పార్లమెంట్ ఎన్నికల కోసం అది ప్రారంభిస్తున్నాం.. ఇది ప్రారంభిస్తున్నాం అంటూ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఇది కేవలం ఎన్నికల ప్రచారమేనని, ఎంపీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ఉరుకులాట ముగుస్తుందన్నారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపుతో కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్పు వస్తుందేమోనని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సభ్యులు అందరూ ఒక్క ఓటు కూడా పక్కకు పోకుండా బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. ప్రజలకు మంచి చేయడం బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజినీ సాయిచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ. నర్సింహులు, కౌన్సిలర్ రవికిషన్‌రెడ్డి, నేతలు రాజేశ్వర్‌గౌడ్, గోపాల్‌యాదవ్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇబ్బందులన్నీ నాకు తెలుసు..



నేను గతంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాను. ఇక్కడి ప్రజల ఇబ్బందులు నాకు తెలుసు. నన్ను ఆదరిస్తే మరింత అభివృద్ధికి కృషి చేస్తా. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, అభ్యర్థుల సహకారంతో శాసనమండలి అభ్యర్థిగా నాకు అవకాశం ఇచ్చారు. అందరూ పూర్తిస్థాయిలో మద్దతు తెలపాలి.

*- నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ శాసనమండలి అభ్యర్థి*

## కేసీఆర్ చూపిన మార్గంలోనే వెళ్తా..



ప్రజలకు అందుబాటులో ఉంటూ 7 నియోజకవర్గాల సమస్యలను పార్లమెంట్‌లో వినిపించాను. ఎంపీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక్కరిని కూడా బాధపెట్టలేదు. అందరితో కలిసి ముందుకు సాగడమే తన ధ్యేయం. చేతనైనంత సాయం చేస్తా. కేసీఆర్ చూపిన మార్గంలోనే నా ప్రయాణం ఉంటుంది. ప్రతిఒక్కరూ నిండు మనస్సుతో మద్దతు తెలపాలి. ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తా.

*- మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ*

## సీఎంది ప్రచార ఆర్భాటమే..



కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది. అభివృద్ధి చేయమంటే ఏవేవో ప్రారంభాలు చేసుకుంటూ పోతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారాలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యలను గాలికొదిలేస్తున్నారు. ఇప్పటికీ కొందరు నాకు ఎమ్మెల్యే గారు అంటూ ఫోన్లు చేస్తున్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విసుగు పుట్టి.. బీఆర్‌ఎస్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

*- చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే*

## రెట్టింపు ఉత్సాహంతో వస్తాం..



రెట్టింపు ఉత్సాహంతో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుంది. ప్రజలకు అమలు కాని హామీలు, మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కొంతమంది చేసిన తప్పులతో తాము అధికారంలోకి రాలేదు. మున్ముందు ఎవరూ ఊహించని స్థాయిలో అధికారంలోకి రావడం ఖాయం. ఇన్‌కంట్యాక్స్ చెల్లిస్తే రైతుబంధు ఇవ్వం.., సిలిండర్ ఇవ్వమంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఎవరికి ఏమి ఇవ్వాలో తెలియని పరిస్థితుల్లో కాంగ్రెస్ సర్కారు ఉన్నది.

*- రాజేందర్‌రెడ్డి, నారాయణపేట మాజీ ఎమ్మెల్యే*

## భారీ మెజార్టీతో గెలిపించాలి..



బీఆర్‌ఎస్ అభ్యర్థులైన నవీన్ కుమార్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని సీఎం చెబుతున్నడు, మోదీ భవిష్యత్తులోనూ తానే పీఎం నంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలు అవసరాలను బట్టి రాజకీయాలు చేస్తున్నాయి.

*- డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే*

## ఎక్కడ చూసినా ఎండిన పంటలే..



ఎంతో శ్రమించి రాష్ట్రాన్ని సుభిక్షంగా చేసుకున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి అభివృద్ధిని గాలికొదిలేసింది. బీఆర్‌ఎస్ హయాంలో ఎక్కడికి వెళ్లినా అభివృద్ధి కనిపించగా.. ప్రస్తుతం ఎండిన పంటలే కనిపిస్తున్నాయి. ఇతర పార్టీల నాయకులను విమర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది.

*- ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే*



పుష్పోత్సవానికి బయలుదేరుతున్న ఆలయ సిబ్బంది

# శోభాయమానం.. పుష్పోత్సవం

శ్రీశైలం, మార్చి 11 : శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. సోమవారం భ్రమరాంబ, మల్లికార్జునస్వామివార్ల ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై ఆశీనులను చేసి పూజలు చేశారు. సాయంత్రం వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలతో అక్కమహాదేవి మండపంలో శాస్త్రోక్త పూజలతో ఆలయోత్సవం నిర్వహించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. అమ్మవారికి ప్రీతికరమైన కాగడాలు, ఎర్రగులాబీలు, తెల్లచామంతి, ఊదా చామంతి, మందారం, లిల్లీ, ఎర్రగన్నేరు, ఊదగన్నేరు, దేవగన్నేరు, నందివర్ధనం, గరుడవర్ధనం, తెల్లచామంతి వంటి 21 రకాల ప్రత్యేక పుష్పాలను స్వామి, అమ్మవార్లకు సమర్పించడంతోపాటు జామ, ఖర్జూర, నల్లద్రాక్ష వంటి 9 రకాల పండ్లతోపాటు బిల్వం, మరువం, మాచీపత్రితో ప్రత్యేక అలంకరణ చేసిన శయనమందిరంలో భ్రమరాంబ, మల్లికార్జునస్వామివార్లకు ఏకాంతసేవగా శయనోత్సవాన్ని నిర్వహించినట్లు ఈవో తెలిపారు.



మహబూబ్‌నగర్‌లోని మదీనా మసీదు

విద్యుద్దీపకాంతుల్లో

ముస్లింలు పరమ పవిత్రంగా భావించే రంజాన్ మాసం వచ్చేసింది. సోమవారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో మంగళవారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇస్లాం మతంలో రంజాన్ నెలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. దానధర్మాలకు ప్రతీకగా ఈ మాసం నిలవనున్నది. ఇస్లాం మతానికి మూలాధారమైన ఖురాన్ ఈ నెలలోనే ఆవిర్భవించింది. ఈ నెలలో ఇస్లాం మత సూత్రాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. అరబ్బీ లో 'రమ్జ' అంటే కాల్చడమని అర్థం. నెలపాటు ఉపవాసదీక్షలతో శరీరం, ఆత్మలోని మలినాలు ప్రక్షాళన కావడంతోపాటు సర్వపాపాలు దహించుకుపోతాయని ముస్లిం మతపెద్దలు చెబుతారు.

# దర్శనమిచ్చిన నెలవంక

- నేటి నుంచి రంజాన్ నెల ప్రారంభం
- నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టనున్న ముస్లింలు
- వెలిసిన హలీం కేంద్రాలు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 11 : నెలవంక దర్శనమివ్వడంతో మహబూబ్‌నగర్ పట్టణంలో సైరన్ మోగింది. రంజాన్ మాసం వచ్చిదంటూ ముస్లింలు సంతోషంగా తమ బంధుమిత్రులకు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఇది పుణ్యాలు మూటగట్టుకునే సీజన్. అల్లా ఆరాధనలో గడిపే మాసం. ఖురాన్‌లో పేర్కొన్న ప్రకారం రంజాన్ నెలలో విధిగా ఆచరించాల్సిన నియమం ఉపవాస వ్రతం. దీనినే పార్సీ భాషలో రోజా, అరబ్బీలో సామ్ అంటారు. ఖురాన్ సంపూర్ణంగా అవతరించిన దినం కూడా రంజాన్ మాసంలోనే ఉండడం విశేషం. జిల్లా వ్యాప్తంగా మసీదులను సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. మహబూబ్‌నగర్‌లోని అన్ని మసీదుల్లో తరావీలో ఖురాన్ పఠనం చేస్తారు. ఖురాన్‌లో 30 పారాలుండగా రోజుకు ఒకటి చొప్పున నెల మొత్తానికి సరిచేస్తారు. కాగా, పట్టణంలోని క్లాక్‌టవర్, వన్ టౌన్, టీడీగుట్ట, న్యూటౌన్, మెట్టుగడ్డ, పద్మావతి, శ్రీనివాసకాలనీలో హాలీం సెంటర్లను ఏర్పాటు చేశారు.

***ఐదు సూత్రాలు.. మూల స్తంభాలు..***

కలిమా, నమాజ్, రోజా, జకాత్, హజ్ అనేవి ఇస్లాంకు మూలస్తంభాలు. వీటిలో హజ్ తప్పా మిగతా నాలుగు సూత్రాలు అమలయ్యేది రంజాన్ నెలలోనే. ఆర్థిక స్థోమత ఉన్న వారు తప్పకుండా హజ్ యాత్ర నియమాన్ని కూడా సంపూర్ణం చేయాలి.

- ⇨ ఇస్లాంలోకి ప్రవేశించే మార్గమే కలిమా. లా ఇలాహ ఇల్లాల్లాహ్, ముహమ్మదుర్ రసూలుల్లాహ్ (సొలెలాహు అలెహివసొలం). సృష్టికర్త మహ్మద్ అని అర్థం. ఈ సూత్రాన్ని విశ్వసించడంతోపాటు ఆచరించాలి.
- ⇨ రోజుకు ఐదు పూటలు నమాజ్‌ను పాటించాలి
- ⇨ రోజా, జకాత్(దానధర్మాలు)కు రంజాన్ మాసంలోనే గొప్ప అవకాశం.
- ⇨ నమాజ్ లేనిదే రోజా సంపూర్ణం కాదు. ప్రతి నమాజ్‌లోనూ కలిమా పఠనం జరుగుతుంది.
- ⇨ హజ్ తప్పా మిగతా మూలస్తంభాలను నిలబెట్టడంలో రంజాన్ మాసం ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉపవాసానికి అత్యంత ప్రాధాన్యం ఉన్నది.

***సమయపాలన ముఖ్యం..***

ధర్మ నిష్టతో ఉపవాసాలు ఉండాలి. నిర్ణీత సమయాల్లోనే సహర్, ఇఫ్తార్ పాటించాలి. అందరు కచ్చితమైన సమయాన్ని పాటించేందుకే సైరన్ మోగిస్తారు. మంచినే పాటిస్తూ చెడుకు దూరంగా ఉండాలి. ఐదు పూటల విధిగా నమాజ్ చేయాలి. ఖురాన్ పఠనం, సారాంశంపై అవగాహన, అల్లాహ్ నామస్మరణ, చింతన అలవర్చుకోవాలి. రంజాన్‌లో చేసే ఏ పవిత్ర కార్యానికైనా 70 రెట్ల పుణ్యం అధికంగా లభిస్తుంది. అందువల్ల ఈ మాసంలో దానధర్మాలు విరివిగా చేస్తారు. మాసం చివరిలో ప్రతి ముస్లిం ఫిత్రా దానం చెల్లించుకోవాలి. ఆర్థిక స్థోమత ఉన్న వారు జకాత్ దానం చేయాలి.

***నియమాలు..***

మత గ్రంథాల ప్రకారం వయోజనులైన స్త్రీ, పురుషులందరూ విధిగా రోజా దీక్ష పాటించాలి. వృద్ధులు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు, ప్రయాణంలో ఉన్నవారికి మినహాయింపు ఉంటుంది. రంజాన్ అంటే పాపాలను దహించివేయుట అని అర్థం. ఉపవాస దీక్షలనేవి మనిషిలోని చెడు భావాలు, అధర్మం, ద్వేషాన్ని రూపుమాపేవిగా ఉండాలి. సాధ్యమైనంత వరకు పుణ్యకార్యాలు చేపడుతుండాలి.

- ⇨ మహ్మద్ ప్రవక్త బోధించిన నియమాల ప్రకారం ఈ నెల రోజులు సూర్యోదయం (సహర్) నుంచి సూర్యాస్తమయం (ఇఫ్తార్) వరకు నీటిని కూడా తాగకుండా ఉపవాసం ఉండాలి.
- ⇨ రంజాన్ మాసంలో 27వ రోజు రాత్రి షబ్–ఏ–ఖదర్ జరుపుతారు. ఈ రాత్రుల్లో జాగరణ ఉండి, ప్రార్థన జరిపితే వెయ్యినెలల పాటు నమాజ్ చేసినట్లు భావిస్తారు.